సాక్షి నారాయణపేట

బుధవారం, 3, ఏప్రిల్, 2024



ఇఫ్తార్ 6-34
(బుధవారం సాయంత్రం)

సహర్ 4-46
(గురువారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు



'బెల్టు' జోరు!

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ పల్లెల్లో బెల్టు దందా జోరుగా సాగుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
41.2 /22.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యవాహిని సేవలు అభినందనీయం

దామరగిద్ద: ఆరోగ్యవాహిని పేరుతో మారుమూల గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం అభినందనీయమని, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. మంగళవారం మండలంలోని కంసాన్‌పల్లిలో వివిధ గ్రామాల ప్రజలకు వైద్య సేవలను అందించేందుకు స్వచ్ఛందంగా ఆరోగ్యవాహిని పేరుతో ఏర్పాటు చేసిన మొబైల్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్యవాహిని నిర్వాహకుడు సాయిప్రతాప్ గతంలో నారాయణపేట, మద్దూర్ మండలాల్లో మొబైల్ వాహనం ద్వారా సేవలు అందించి సత్ఫలితాలు ఇవ్వడంతో దామరగిద్ద మండలంలోను చేపట్టడం అభినందనీయమన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మక్తల్: ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మక్తల్ మండలం చందపూర్, కర్ని, ముస్లాయిపల్లి, సంగంబండలో జాతీయ అయోడిన్ లోప జాగ్రత్త నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పాఠశాల విద్యార్థులపై అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలో దాదాపు 30 గ్రామాలను ఎంపిక చేయడం చేసి, ఆయా గ్రామాల్లో విద్యార్థుల రక్త నమూనా శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌కు పంపిచడం జరుగుతుందన్నారు. అయోడిన్ శాతం తక్కువ ఉన్న వారు అయోడిన్ ఉప్పు వాడాలని, దీని లోపం కారణంగా మానసికంగా శారీకంగా ఎదుగుదల లోపం ఉంటుందని అన్నారు. అయోడిన్ సరైన మోతాదులో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతి, వినోద్‌గౌడ్, హబీబ్ , పద్మవతి, విశాల తదితరులు పాల్గొన్నారు.

పీయూలో క్యాంపస్ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో విజయశ్రీ బయో ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ మేరకు సెలక్షన్స్‌కు మొత్తం 32 మంది విద్యార్థులు హాజరవగా 25 మంది మౌఖిక పరీక్షకు హాజరైనట్లు పీయూ ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్ తెలిపారు. కార్యక్రమంలో రంజిత్‌రెడ్డి, పరశురాం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లు క్వింటా రూ.2,311

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వడ్లు సోనా క్వింటాకు గరిష్టంగా రూ.2,311, కనిష్టంగా రూ.2,229 ధర పలికింది. అలాగే, వడ్లు హంస గరిష్ట, కనిష్టంగా రూ.1,630, అలసందలు గరిష్టంగా రూ.7,333, కనిష్టంగా రూ.6,071, జొన్నలు గరిష్టంగా రూ. 5,050, కనిష్టంగా రూ.3,840, పెసర గరిష్టంగా రూ.8,689, కనిష్టంగా రూ.8,206 ధరలు పలికాయి.

వేరుశనగ క్వింటాల్ రూ.7,089



జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వేరుశనగకు క్వింటాలు గరిష్టంగా రూ.7,089, కనిష్టంగా రూ.5,735 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్న గరిష్టంగా రూ.2,236, కనిష్టంగా రూ.1,932, ఆముదాలు గరిష్టంగా రూ.5,780, కనిష్టంగా రూ.5,681, జొన్నలు గరిష్టంగా రూ.5,129, కనిష్టంగా రూ.4,910, ధాన్యం ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,267, కనిష్టంగా రూ.1,969, పెసర్లు రూ.7,309, పెబ్బర్లు రూ.6,439, మినుములు రూ.8,737 చొప్పున వచ్చాయి.

సోనామసూరి రూ.2,536

దేవరకద్ర మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన టెండర్లలో సోనామసూరి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,536, కనిష్టంగా రూ.2,324 ధర లభించింది. హంస క్వింటాల్‌కు సరాసరిగా రూ.1,729 ఒకే ధర వచ్చింది. సీజన్ ప్రారంభం కావడం వల్ల మార్కెట్‌కు దాదాపు 3 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.


నేడు ఉల్లిపాయల వేలం

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉదయం ఉల్లిపాయల వేలం జరుగుతుంది. ప్రతివారం జరిగే వేలానికి చుట్టు పక్కల మండలాల నుంచి పెద్దఎత్తున ఉల్లి అమ్మకానికి వస్తుంది. ప్రస్తుతం సీజన్ కావడంతో ఉల్లి పెద్ద మొత్తంలో అమ్మకానికి వచ్చే అవకాశం ఉంది. అయితే ధరలు మాత్రం నిలకడగానే కొనసాగుతున్నాయి.

గెలుపే లక్ష్యంగా గురి!

లోక్‌సభ ఎన్నికల వేళ వేడెక్కిన రాజకీయం

- 2 పార్లమెంట్ స్థానాల్లోనూ త్రిముఖ పోరు
- సభలు, సమావేశాలతో దూకుడు పెంచిన బీజేపీ
- ఆపరేషన్ ఆకర్ష్ మంత్రంతో కాంగ్రెస్..
- బీఆర్ఎస్ శ్రేణుల్లో వీడని మౌనం
- ఉగాది తర్వాత 'ప్రత్యేక' వ్యూహంతో ముందుకు..



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పక్షాలు ప్రచార వ్యూహాలపై గురి పెట్టాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్, ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ దృష్టి సారించాయి. ప్రత్యేక వ్యూహ రచనలతో వేగంగా పావులు కదుపుతున్నాయి. అభ్యర్థుల ఎంపిక దగ్గరి నుంచి మొదలు ఆచితూచి అడుగులు వేసిన పార్టీలు.. క్రమక్రమంగా పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం అడుగులు వేస్తున్నాయి. మూడు ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థిత్వాలు ఖరారు కాగా.. ప్రచారంపై దృష్టి కేంద్రీకరించిన అభ్యర్థులు తమ తమ స్టైల్‌లో ముందుకు సాగుతున్నారు.

ఉగాది తర్వాతే గు'లాబీ'..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాభావం, సిట్టింగ్ ఎంపీ రాములు బీజేపీలో చేరడం.. ఇతర ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిన క్రమంలో బీఆర్ఎస్ డీలా పడింది. రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ అభ్యర్థులు ఖరారైనప్పటికీ.. స్తబ్దత కొనసాగుతోంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో ఎలానైనా సత్తా చాటాలని భావిస్తున్న ఆ పార్టీ అధిష్టానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తులో భాగంగా చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల క్రమంలో బీఎస్పీ మాజీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఆయననే రంగంలోకి దింపింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అలంపూర్‌కు చెందిన ఈ మాజీ ఐపీఎస్ అధికారిని బరిలో దించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో తమకు లబ్ధి చేకూరుతుందని భావిస్తోంది. త్వరలోనే నియోజవర్గ పరిధిలో క్షేత్రస్థాయి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతోంది. మహబూబ్‌నగర్ సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో నిలవగా.. ప్రచారంలో ఇప్పటివరకు కదలిక లేదు. ఉగాది తర్వాత బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరం చేయనున్నట్లు సమాచారం. మొత్తానికి రెండు పార్లమెంట్ స్థానాల్లో తమ తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల ఎత్తులు, పైఎత్తుల నడుమ త్రిముఖ పోరు కొనసాగనున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

చేరికలతో పై'చేయి'..

కాంగ్రెస్‌కు సంబంధించి మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌ రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి పార్టీ సీనియర్ నేత, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి బరిలో నిలవనున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, షాద్‌నగర్, కొడంగల్) అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వంశీచంద్‌రెడ్డి ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే న్యాయ్‌యాత్ర పేరుతో అన్ని నియోజకవర్గాలను చుట్టేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అలంపూర్, గద్వాల మినహా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, వనపర్తి అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలన్న పట్టుదలతో ప్రచారం ముమ్మరం చేసింది. ఈ క్రమంలో రెండు పార్లమెంట్ల పరిధిలో ఇతర పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై దృష్టి పెట్టింది. మహబూబ్‌నగర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ 'చేయి' అందుకోగా.. మహబూబ్‌నగర్, కోస్గి మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశమయ్యాయి. పెద్ద ఎత్తున ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు హస్తం గూటికి చేరారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ పరిధిలో మాజీ మంత్రి, బీజేపీ నేత చిత్తరంజన్‌దాస్‌ను చేర్చుకునేందుకు కాంగ్రెస్ మంతనాలను జరిపి సక్సెస్ అయింది. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శులు, జాతీయ కోఆర్డినేటర్లు, ముఖ్యనేతల సమక్షంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బూత్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆ తర్వాత పార్టీ ద్వారా ప్రచార కార్యక్రమాలను ఇంటింటికీ చేర్చేందుకు కసరత్తు ప్రారంభించింది.

దూకుడు పెంచిన బీజేపీ..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఉమ్మడి పాలమూరు నుంచి బీజేపీ ఎన్నికల శంఖారావం పూరించింది. ఏకంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించి ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ రాములును పార్టీలో చేర్చుకోవడం ద్వారా తమ బలం పెరిగిందని బీజేపీ భావిస్తోంది. వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సన్నిహితుడు, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి వంటి నేతల చేరిక తమకు కలిసి వస్తోందని కమలదళం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ఎంపీ రాములుతో పాటు ఆయన తనయుడు, పార్టీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌తో కలిసి అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాల్లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ.. క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారానికి పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. విజయమే లక్ష్యంగా రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రచారం ముమ్మరం చేశారు. ప్రతిరోజూ ఏదో ఒక చోట సభలు, సమావేశాలు నిర్వహిస్తూ.. పదునైన మాటల తూటాలతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు.. మహిళలు, న్యాయవాదులు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధితో పాటు కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

పారదర్శకంగా పార్లమెంట్ ఎన్నికలు



ఎన్నికల నిర్వహణపై శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: మహబూబ్‌నగర్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి పీఓలు, ఏపీఓలకు పోలింగ్ ప్రక్రియపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌లెట్స్‌ను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధానాన్ని తెలుసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉన్నట్లయితే మాస్టర్ ట్రైనర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. గత అసెంబ్లీలో పనిచేసిన అనుభవంతో ఈ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

3 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్..

ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది మే 3 నుంచి 8 వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను ఫెసిలేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ (రెవెన్యూ) కలెక్టర్ అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏఓ నర్సింగరావు, జిల్లా అధికారులు కృష్ణమాచారి, టైటాస్ పాల్, నారాయణపేట, ఉట్కూర్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

'అమ్మ' ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా గ్రామాల మహిళా సంఘం అధ్యక్షురాలు, పాఠశాల హెచ్‌ఎం, ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లుల తో కమిటీలను ఏర్పాటు చేయాలని, ఇకపై పాఠశాలల్లో జరిగే సివిల్ వర్క్స్ అన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తీర్మాణంతోనే కొనసాగుతాయన్నారు. ఈ కమిటీలే పాఠశాల నిర్వహణను పర్యవేక్షిస్తాయని చెప్పారు. ఆయా కమిటీలు రూ.25 వేల వ్యయం వరకు సివిల్ పనులు చేయవచ్చని, రూ.లక్ష వరకు చేసే పనులకు ఎంపీడీఓ, రూ.లక్ష దాటిన పనులకు తాను అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలో కిటికీలు తలుపులు, ఎలక్ట్రిసిటీ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మతులు కమిటీ ద్వారా కొనసాగుతాయని, అలాగే పాఠశాల ఇన్ఫ్రాస్ట్రక్చర్ పై కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తుందన్నారు. ఈ ఏడాది జూన్ 13లోగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేయాల్సిన మరమ్మతు పనులకు సంబంధించిన అంచనాలను మూడు రోజుల్లో ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఈఓ అబ్దుల్ ఘని, డీఆర్డీఓ రాజేశ్వరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే విధంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సెర్ప్ అధికారుల సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికిగాను బ్యాంకు లింకేజీని రూ.300 కోట్ల లక్ష్యంగా పెట్టుకొని ప్రతి స్వయం సహాయక సంఘానికి రూ.6 లక్షలు తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు.

'జాతీయవాదం పేరుతో దాడులు సరికాదు'

మహబూబ్‌నగర్ రూరల్: న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను మూలస్తంభాలుగా భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందిస్తే కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసమవుతున్నాయని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మహనీయుల మాసోత్సవంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి 8 వరకు జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన రాజ్యాంగ రక్షణ యాత్రను మంగళవారం మహబూబ్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో జీవించే హక్కు, మాట్లాడే స్వేచ్ఛ కోల్పోతున్నామన్నారు. ప్రజలను కులాలు, మతాలుగా విడగొడుతూ మనువాద వారసత్వాన్ని అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్ల పరం చేస్తుందన్నారు. ఫలితంగా పేద, ధనిక వర్గాల మధ్య రోజురోజుకు అగాధం పెరుగుతోందన్నారు. జాతీయవాదం పేరుతో దళిత, మైనారిటీ వర్గాలపై జరిగిన దాడుల నుంచి మణిపూర్‌లో గిరిజన మహిళలను వివస్త్రను చేసిన ఘటన వరకు రాజ్యాంగ హక్కులను కేంద్రం కాలరాస్తూనే ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ దేశ ఆర్థిక స్వావలంబనకే బీజేపీ ప్రభుత్వం ముప్పుగా మారిందని విమర్శించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ పేరుతో దేశ పౌరులలో అభద్రతాభావం పెంచిందని దుయ్యబట్టారు. దళితుల అస్తిత్వాన్ని దెబ్బతీసి వారిని దేశంలో ఒంటరిగా చేసే కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామనే వరకు తెగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైరి రమేష్, బ్యాగరి వెంకటస్వామి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ

- చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలతో మద్యం, నగదు కట్టడి
- రెండు రాష్ట్రాల పోలీసులు సమాచారం చేరవేసుకోవాలి
- బళ్లారి డీఐజీ బీఎస్ లోకేశ్‌కుమార్, జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



పార్లమెంట్ ఎన్నికలపై చర్చిస్తున్న డీఐజీలు

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర (తెలంగాణ– కర్ణాటక) సరిహద్దు వద్ద ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని బళ్లారి డీఐజీ బీఎస్ లోకేష్‌కుమార్, జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. మహబూబ్‌నగర్‌లోని డీఐజీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ, కర్ణాటక సరిహద్దు పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీలు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు సమష్టి కృషితో ముందుకు వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సరిహద్దు దగ్గర పటిష్టమైన భద్రత చర్యలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మద్యం, నగదు నియంత్రణపై చేపట్టాల్సిన చర్యలపై దృష్టిపెట్టడం జరుగుతుందన్నారు. ప్రధానంగా అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా పోలీస్ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో 24/7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలా చూడాలన్నారు. సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా పెట్టడం వల్ల మద్యం, నగదు సరఫరాను అరికట్టవచ్చన్నారు. దీంతోపాటు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సమాచార మార్పిడితో కట్టడి చేయాలన్నారు. పాత నేరస్తులు, ఇతరుల సంచారంపై నిత్యం ఇంటెలిజెన్స్ సమాచారంతో ముందుకు వెళ్లాలన్నారు. గతంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసుకోవాలన్నారు. జిల్లాల సరిహద్దులో ఉండే సమస్యాత్మక గ్రామాలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్, గద్వాల ఎస్పీ రితిరాజ్, నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతం, రాయిచూర్ ఎస్పీ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మెజార్టీ సీట్లు గెలుస్తాం



ధన్వాడలో విలేకర్లతో మాట్లాడుతున్న డీకే అరుణ

ధన్వాడ/దామరగిద్ద: పాలమూరు – రంగారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు సోయి తప్పి మాట్లాతున్నారని, ప్రాజెక్ట్ కోసం జీఓ తెచ్చింది నేను అని, రాష్ట్రంలో మెజార్టీ పార్లమెంట్ సీట్లు బీజేపీయే గెలుస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే.అరుణ అన్నారు. మంగళవారం ధన్వాడ, దామరగిద్దలో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల గురించి ఏనాడు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని విమర్శించారు. జీఓ 69తో కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించవచ్చని, అదే పాలమూరు – రంగారెడ్డి పథకంలో జూరాల బ్యాక్‌వాటర్ నుంచి నీరు తీసుకుంటే ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, కొడంగల్, పాలమూరు, కోస్గి, షాద్‌నగర్ వరకు 7లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు అని అన్నారు. ఇందుకోసం డీపీఆర్‌ఓ తెచ్చే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందా అని ప్రశ్నించారు. ఒకవేల డీపీఆర్‌ఓ తీసుకువస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చే బాధ్యత తనదని అన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అవి చెల్లని ఓట్లు పరిగణిస్తారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆ పార్టీ వారిని ఓటమి వెంటాడుతుందని ఆమె ఆరోపించారు.

బూత్ స్థాయి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచే పార్టీని పటిష్టం చేసుకునేందుకు కార్యకర్తలు పనిచేయలని, దేశం అభివృద్ధి చెందాలి అంటే మరోసారి మోదీ ప్రధాని కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, సత్యం మాదవ్, తిరుపతిరెడ్డి, రామచంద్రయ్య, సత్తి సత్యనారాయణ, నరసింహులు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మశ్యాంసుందర్‌గౌడ్, మల్లయ్య, మాకం సురేందర్, ఉమష్‌కుమార్, గోవర్దన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, రఘురామయ్యగౌడ్, లక్ష్మీ శ్యాంసుందర్, కెంచె శ్రీనివాస్, శ్యాంసుందర్‌గౌడ్, సత్య రఘుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటినుంచి 'పది' మూల్యాంకనం



మహబూబ్‌నగర్‌లోని వాల్యువేషన్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈఓ రవీందర్

- పాలమూరులోనే గద్వాల, నారాయణపేట జిల్లాల వాల్యువేషన్
- ఆర్డర్లు అందుకున్నవారు విధులకు రావాలని డీఈఓ సూచన
- పాల్గొననున్న 1,210 మంది ఉపాధ్యాయులు
- కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లకు అనుమతి నిరాకరణ
- ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయొద్దని సూచన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల పదో తరగతి వార్షిక పరీక్షలు ముగియడంతో విద్యాశాఖ అధికారులు బుధవారం నుంచి పేపర్ మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈ మేరకు మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాలకు సంబంధించిన పేపర్లను పాలమూరులోనే వాల్యువేషన్ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా జిల్లాకేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో సెంటర్ ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి ఏర్పాట్లను డీఈఓ రవీందర్ మంగళవారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వాల్యువేషన్ పూర్తి చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయా జిల్లాల నుంచి మొత్తం 2.30 లక్షల పేపర్లు వాల్యువేషన్ చేయనున్నారు. ఇందుకు గాను 800 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 150 చీఫ్ ఎగ్జామినర్లు, 260 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు అధికారులు ఆర్డర్ కాపీలు జారీ చేశారు. అయితే కొంతమంది ఉపాధ్యాయులు తమకు అనారోగ్యం తదితర సమస్యలు ఉండటం వల్ల విధులకు హాజరు కాలేమని, మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి..

వాల్యువేషన్ కేంద్రం వద్ద సిబ్బంది ఇతర అధికారులు తప్పకుండా విద్యాశాఖ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకుల పేర్లతో వాల్యువేషన్ కేంద్రం వద్ద ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్ట వద్దని డీఈఓ రవీందర్ సూచించారు. ముఖ్యంగా వాల్యువేషన్ కేంద్రంలోకి ఎలాంటి పరిస్థితుల్లో సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకురావద్దని హెచ్చరించారు. ఉదయం 9 గంటలకు కేంద్రంలోకి వచ్చిన వారిని సాయంత్రం 5 గంటలకు బయటికి పంపిస్తామని.. దీన్ని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది మధ్యాహ్న భోజనం తెచ్చుకోవాలని చెబుతున్నారు. ఐడీ కార్డు లేని సంఘాల నాయకులు, ఇతర సిబ్బంది ఎవరూ కేంద్రంలోకి రావొద్దని పేర్కొన్నారు.

మినహాయింపు లేదు..

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రంలోకి ఎటువంటి పరిస్థితుల్లో సిబ్బంది సెల్ ఫోన్లు తీసుకురావొద్దు. అక్కడ ఎలాంటి బ్యానర్లు కట్టవద్దు. ఐడీ కార్డులు లేని వారు కేంద్రంలోకి రాకూడదు. ఆర్డర్ తీసుకున్న వారు తప్పకుండా విధులకు హాజరుకావాలి. ఎవరికీ మినహాయింపు లేదు. అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

ఈతకు వెళ్లి.. బాలిక మృతి


మమత (ఫైల్)

ధరూరు: ఈతకు వెళ్లిన ఓ బాలిక బావిలో మునిగి మృతిచెందిన ఘటన మండలంలోని గార్లపాడులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగేంద్రకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మూడో కుమార్తె మమత (11) స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదివేది. ఒంటిపూట బడులు కొనసాగుతుండటంతో మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాల వదిలాక భోజనం చేసి స్నేహితులతో కలిసి ఈత నేర్చుకునేందుకు వెళ్లింది. నడుముకు కట్టుకున్న మునగ బెండు జారిపోవడంతో నీటిలో మునిగిపోయింది. గుర్తించిన స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకొని నీటిలో గాలించారు. సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో బయటకు తీయగా అప్పటికే మృతిచెందింది. కుమార్తె మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

బొలెరో ఢీకొని యువకుడు దుర్మరణం

కల్వకుర్తి టౌన్: పట్టణ పరిధిలోని కోదాడ జాతీయ రహదారిపై జేపీనగర్ అండర్ పాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు (30) దుర్మరణం పాలయ్యాడు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం కల్వకుర్తి నుంచి జేపీనగర్ వైపు బైకుపై వెళ్తున్న యువకుడిని వెనక నుంచి బొలెరో వాహనం అండర్ పాస్‌లో ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి..


భానుమూర్తి (ఫైల్)

అలంపూర్: రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందిన ఘటన అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్షుల కథనం మేరకు.. మండలంలోని క్యాతూర్‌కు చెందిన భానుమూర్తి (53) కర్నూలులో నివాసం ఉంటూ గద్వాలలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించేవాడు. మంగళవారం బైక్‌పై కర్నూలు నుంచి కంచుపాడులోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్తుండగా అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఆయన వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జడ్చర్ల: అనారోగ్య సమస్యలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిల చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. మండలంలోని నసరుల్లాబాద్ తండాకు చెందిన పాత్లావత్ జ్యోతి(37) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో గత నెల 29న మరోసారి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై మంగళవారం జ్యోతి సోదరుడు ఇస్లావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి..

కల్వకుర్తి రూరల్: భార్యాభర్తల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదంలో పురుగు మందు తాగి భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని చోలాపూర్ ప్రాంతానికి చెందిన మనస్వి సాగర్‌చౌహాన్ దంపతులు, కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లికి చెందిన రమేష్ పశువుల షెడ్‌లో పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట మనస్వీ(22), సాగర్‌చౌహాన్ మధ్య గొడవ చోటుచేసుకుంది. క్షణికావేశంలో ఆమె పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ విషయంపై మృతురాలి తల్లి సీతాబాయి సిందె కల్వకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఇబ్రహీంతో పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ మాధవరెడ్డి తెలియజేశారు.

ఆరని మంటలు

అదుపులోకి వచ్చేందుకు మరో 12 గంటల సమయం పట్టే అవకాశం


కాలిబూడిదైన గన్నీబాగులు

- కాలి బూడిదైన సుమారు 13 లక్షల గన్నీబ్యాగులు
- మంటలు తగ్గకపోవడంతో వెనుదిరిగిన ఫోరెన్సిక్ నిపుణులు
- 1, 3 కంపార్ట్‌మెంట్ల నుంచి ప్రారంభమైన ధాన్యం తరలింపు

వనపర్తి: పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంలో సోమవారం సాయంత్రం చెలరేగిన మంటలు మంగళవారం రాత్రి వరకు అదుపులోకి రాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. నాబార్డ్ నిధులు రూ.3 కోట్లతో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించిన గోదాంలో మూడు కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 1వ కంపార్ట్‌మెంట్‌లో రైస్‌మిల్లుకు చెందిన 14 వేల బస్తాల వరి ధాన్యం, 2వ కంపార్ట్‌మెంట్‌లో పౌరసరఫరాలశాఖకు చెందిన సుమారు 13 లక్షల ఖాళీ గన్నీబ్యాగులు, 3వ కంపార్ట్‌మెంట్‌లో మరో రైస్‌మిల్లుకు చెందిన సుమారు 60 వేల బస్తాల వరి ధాన్యం వేర్వేరు రెంట్ అగ్రిమెంట్లతో నిల్వ చేశారు. సోమవారం సాయంత్రం గోదాంలో నుంచి మంటలు వస్తున్నట్లు గుర్తించిన రాజు అనే వ్యక్తి కొత్తకోట అగ్నిమాపకశాఖ అధికారి శంకర్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌తో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అదుపులోకి రాకపోవడంతో సమీప ప్రాంతాల నుంచి మరో ఐదు ఫైరింజన్లతో పాటు లిక్కర్ ఫ్యాక్టరీ నుంచి వాటర్ ట్యాంకులను రప్పించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. పొక్లెయిన్ సాయంతో గోదాం గోడలను కూల్చి మంటలు ఆర్పే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. మంటలకు గోదాం పైభాగంలోని రేకులు కరిగిపోవడం కనిపించింది.

పరిశీలించిన మంత్రి, ఆర్జేడీ, కలెక్టర్..

ఘటనా స్థలాన్ని మంగళవారం ఉదయం మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ ఇఫ్తెకార్ నదీమ్, కలెక్టర్ తేజస్ పవార్, అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాత్రి రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వేర్వేరుగా సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంటలు చెలరేగేందుకు గల కారణాలు తేల్చాలని అధికారులకు సూచించారు.

మరో 12 గంటల సమయం..

గన్నీబ్యాగులకు నిప్పంటుకోవడం, అన్నివైపుల నుంచి మంటలను ఆర్పే ఆస్కారం లేకపోవడంతో ఆలస్యమవుతోందని కొత్తకోట అగ్నిమాపకశాఖ అధికారి శంకర్ వివరించారు. మంగళవారం రాత్రి నుంచి పొక్లెయిన్ సాయంతో గన్నీబ్యాగులను బయటకు తీసుకొచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నాం. మంటలకు పొక్లెయిన్ డీజిల్ పైపు కాలిపోవటంతో కాసేపు ఆటంకం ఏర్పడిందన్నారు. మరో పొక్లెయిన్‌తో మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నామని చెప్పారు.

వెనుదిరిగిన ఫోరెన్సిక్ నిపుణులు..

ఆధారాలు సేకరించేందుకు ఫోరెన్సిక్ నిపుణులు రాగా మంగళవారం సాయంత్రం వరకు గోదాంలో మంటలు తగ్గకపోవటంతో చేసేదిలేక వెనుదిరిగినట్లు తెలుస్తోంది. మంటలు తగ్గాక ఆధారాలు సేకరించే అవకాశం ఉంది.

ధాన్యం తరలింపు షురూ..

పౌరసరఫరాలశాఖ అధికారుల అనుమతితో 1, 3 కంపార్ట్‌మెంట్లలోని వరి ధాన్యాన్ని సంబంధిత రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియ మంగళవారం ప్రారంభించారు. రెండ్రోజుల్లో ధాన్యం పూర్తిగా తరలించే అవకాశం ఉంది. వేడి తీవ్రతకు పదిశాతం ధాన్యం దెబ్బతిని ఉండవచ్చని అధికారుల ప్రాథమిక అంచనా.

అనుమానాలెన్నో..

పత్తి నిల్వ చేసే సమయంలో సీసీఐ సూచన మేరకు రెండేళ్ల కిందటే విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేకపోవడంతో షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేదు. గేటు వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి. మార్కెట్‌యార్డులో ఎప్పుడూ ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉంటారు. యాదృచ్ఛికంగా మంటలు చెలరేగే ఆస్కారం లేదు. ఉద్దేశపూర్వకంగా చేసేందుకు ఇతరులు సెక్యూరిటీ అనుమతి లేకుండా లోనికి వెళ్లి నిప్పంటించాల్సిన అవసరం ఎవరికి ఉంటుందనే ప్రశ్నలు అధికారులు, స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


గోదాంలోని వరి ధాన్యాన్ని తరలిస్తున్న హమాలీలు

సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు


బెల్లం ఊట పారబోస్తున్న ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలో నాటు సారా తయారీ కేంద్రాలపై నాగర్‌కర్నూల్ సూపరింటెండెంట్ గాయత్రి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుధాకర్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. ఊర్కొండ మండలం రెడ్యాతండా, కల్వకుర్తి మండలం తర్నికల్ తండాలో దాడులు నిర్వహించి, 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 21 లీటర్ల నాటుసారా, 30 కిలోల బెల్లం, 10 కిలోల పటిక స్వాధీనం చేసుకుని, నాలుగు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, నాగర్‌కర్నూల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో పాటు సీఐలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రెడ్డి, కల్యాణ్, వీరబాబు, వివేక్, నాగరాజు పాల్గొన్నారు.

టమాట లోడ్‌తో వెళ్తున్న వాహనం బోల్తా


బోల్తాపడిన బొలెరో వాహనం

ధరూరు: రైతులు పండించిన టమాటలను మార్కెట్‌కు తరలిస్తున్న క్రమంలో అదుపు తప్పి బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటన మండల పరిధిలోని పారుచర్ల స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కుర్వ గోవిందు తన బొలెరో వాహనంలో మంగళవారం రైతుల పొలాల వద్ద నుంచి గద్వాల మార్కెట్‌కు టమాటలు తీసుకెళ్తున్నాడు. ఉదయం 6 గంటల సమయంలో గద్వాల– రాయిచూరు ప్రధాన రహదారిలోని ధరూరు– పారుచర్ల స్టేజీల మధ్య వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్ గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను గద్వాలకు తరలించి చికిత్స చేయించారు.

భారీగా నగదు పట్టివేత


నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో ఎస్ఐ శ్రీనివాసరావు


కొల్లూరులో పట్టుబడిన నగదుతో పోలీసులు


బాలానగర్‌లో నగదు చూపుతున్న ఎస్ఐ

మహబూబ్‌నగర్ క్రైం/బాలానగర్/అలంపూర్/కేటీదొడ్డి/నవాబుపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మహబూబ్‌నగర్ న్యూటౌన్ ఏరియాలో ప్రైవేటు ఉద్యోగి మిర్జాపూర్ కృష్ణ రూ.2లక్షల 14వేల నగదు తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.

- హైదరాబాద్ నుంచి ఏపీలోని పుట్టపర్తి జిల్లాకు చెందిన సయ్యద్ ఆమస్ ఉల్లా తన కారులో రూ.50,600 తరలిస్తుండగా.. బాలానగర్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.
- అలంపూర్ సమీపంలోని రాష్ట్ర సరిహద్దు పుల్లూరు చెక్‌పోస్టు వద్ద కోడుమూరు నుంచి బుడగజంగాల సవారి అనే వ్యక్తి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న రూ.10 లక్షల 4వేల నగదుతో పాటు డీకే ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తితో రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు.
- కేటీదొడ్డి మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద రూ.54,200 నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.
- నవాబుపేట మండలం కొల్లూర్‌లో సాబాద్ మహేష్‌యాదవ్ అనే వ్యక్తి రూ.63వేల నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

బాలికపై ఆటోడ్రైవర్ లైంగికదాడి

- పోక్సో కేసు నమోదు

బల్మూర్: ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న ఓ బాలికపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి పాల్పడిన ఘటన బల్మూర్ మండలంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (14) తన నాన్నమ్మ వద్ద ఉంటూ 8వ తరగతి చదువుతుంది. అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చింత రాజు గతనెల 24న ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక నాన్నమ్మ పార్వతమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసి, బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. కాగా, ఏడాది కిందట కూడా బాలికపై చింత రాజు అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కుక్కల దాడిలో నెమలి మృతి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామ శివారు ప్రాంతంలోని నెమలి, గ్రామంలోని రోడ్డు మీదకు వచ్చిన వెంటనే కుక్కలు వెంట పడి దాడి చేశాయి. దాడిలో నెమలి అక్కడికక్కడే మృతిచెందింది. వెంటనే ఎస్ఐ చంద్రకాంత్‌కు సమాచారం అందడంతో చెన్నిపాడుకు పోలీసులను పంపించారు. వారు మానవపాడు పోలీస్‌స్టేషన్‌కు నెమలిని తీసుకెళ్లారు. ఫారెస్ట్ అధికారులకు ఫోన్ చేసి నెమలిని వారికి అప్పగించారు. మానవపాడు పశుసంవర్ధక శాఖలో పోస్టుమార్టం నిర్వహించి, ఫారెస్ట్ అధికారులు తీసుకువెళ్లారు.

పశువుల పాక దగ్ధం

కోస్గి: నిప్పంటుకుని పశువుల పాక దగ్ధమైన ఘటన మండలంలోని ముక్తిపాడ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎల్లప్ప పశువుల కోసం తన ఇంటి సమీపంలోనే పాక నిర్మించారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పాకకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గుర్తించిన చుట్టుపక్కల వారు వెంటనే సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. పాకలో కట్టేసిన బర్రె దూడకు మంటలంటుకొని గాయాలయ్యాయి. అలాగే పంటలకు నీరు సరఫరా చేసే పైపులు, ఇతర సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నారు.



బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని వినతి


కలెక్టరేట్ వద్ద పాలమూరు అభివృద్ధి ఫోరం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మండలంలోని దివిటిపల్లిలో అమరరాజా లిథియం బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మంగళవారం పాలమూరు అభివృద్ధి ఫోరం ఆధ్వర్యంలో కలెక్టర్ రవినాయక్‌కి వినతిపత్రం అందజేశారు. ప్రజల ఆరోగ్యంతో పాటు జీవరాశులపై ప్రభావం చూపే పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజాభిప్రాయం సేకరించకుండా నెలకొల్పడం తగదన్నారు. భూ, వాయు కాలుష్యం అధికంగా ఉంటాయని, సుమారు 50 కిలోమీటర్ల వరకు కాలుష్యం వ్యాపించి ప్రజలు కాలెయం, చర్మవ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని, ఇలాంటి పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని కోరారు. కాలుష్య కారక పరిశ్రమను ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలమూరు అభివృద్ధి ఫోరం నాయకులు సారంగి వినయ్‌కుమార్, పటేల్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అబలలకు అండగా..


సమావేశంలో పాల్గొన్న జిల్లా మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

- స్వయం సహాయక సంఘాల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- మళ్లీ సున్నా వడ్డీతో రుణాలు మంజూరు చేయాలని నిర్ణయం
- వివిధ ప్రభుత్వ పనుల్లో భాగస్వామ్యం కల్పించాలని యోచన
- ఇప్పటికే విద్యార్థుల యూనిఫాంల కుట్టు పని అప్పగింత
- రూ.5 లక్షల వరకు సభ్యులకు బీమా

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడంతోపాటు వివిధ ప్రభుత్వ పనుల్లో వారిని భాగస్వాములు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల యూనిఫాం కుట్టు పనిని మహిళా సంఘాలకే అప్పగించిన ప్రభుత్వం.. స్వయం ఉపాధి రంగాల్లోనూ ప్రోత్సహించాలని యోచిస్తోంది. అయితే జిల్లాలోని పలు స్వయం సహాయక సంఘాలు చిన్నతరహా పరిశ్రమలు, మిల్లెట్స్ తినుబండారాల తయారీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు. వడ్డీ లేని రుణాలు అందిస్తే మరింత పురోగతి సాధ్యమయ్యే అవకాశం ఉంది.

ఆర్నెళ్లకోసారి వడ్డీ చెల్లింపు

గతంలోనే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించేవారు. సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే ఆయా సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీ మొత్తాన్ని చెల్లించేది. అయితే గత ప్రభుత్వ హయాంలో వడ్డీ రాయితీ చెల్లింపులు ఆగిపోయాయి. ఎస్‌హెచ్‌జీలకు మళ్లీ వడ్డీ లేని రుణాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి మహిళా సంఘాలకు వడ్డీ చెల్లింపులు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అలాగే స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు అనుకోని కారణాలతో మరణించినా తీసుకున్న రుణం మాఫీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

శుభపరిణామం..

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం చర్యలు చేపట్టడం శుభ పరిణామం. వడ్డీ లేని రుణాలు అందిస్తే మహిళలు ఎక్కువ మంది లోన్లు తీసుకునేందుకు ముందుకు వస్తారు. ఇది స్వయం ఉపాధిలో రాణించేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

– రజిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

బీమాతో ధీమా..

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బీమా అమలు చేస్తుండగా.. స్వయం సహాయక సంఘాల సభ్యులకు సైతం వర్తింపజేయడం సంతోషంగా ఉంది. ప్రమాదవశాత్తు సభ్యురాలు మరణిస్తే బాధిత కుటుంబానికి బీమాతో ధీమా కల్పించినట్లవుతుంది.

– సుమతి, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఇచ్చే వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. మళ్లీ సున్నా వడ్డీతో రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే మహిళలకు రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కూడా కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

– నర్సింహులు, డీఆర్‌డీఓ

18- 60 ఏళ్లలోపు వారికి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు మహిళా సంఘాల సభ్యులకు అభయహస్తం, ఆమ్ ఆద్మీ, జనశ్రీ వంటి పథకాలతో బీమా అమలయ్యేది. సభ్యురాలితోపాటు ఆమె భర్తకు సైతం ఇది వర్తింపజేశారు. ఎలాంటి మరణానికైనా రూ.30 వేలు బాధిత కుటుంబానికి చెల్లించారు. ప్రస్తుతం వారికి బీమా పథకాలు రద్దు కావడంతో ఎలాంటి భరోసా లేకుండా పోయింది. ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిగా ఉన్న ప్రతి మహిళకు రూ.5 లక్షల వరకు బీమా వర్తింపజేసేందుకు నిర్ణయించింది. 18 నుంచి 60 ఏళ్లలోపు వారికి ఈ బీమా సౌకర్యం కల్పిస్తారు. దీనికి సంబంధించిన ప్రీమియం సైతం ప్రభుత్వమే చెల్లించనుంది. అలాగే ఒక్కో గ్రామ సమాఖ్య పరిధిలోని సంఘాలకు రూ.కోటి వరకు రుణం మంజూరు చేయనున్నారు. ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ అందించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.

'కాంగ్రెస్ పార్టీకే మా మద్దతు'


అచ్చంపేటలో మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

అచ్చంపేట: దళితుల అభ్యున్నతి, సాధికారత కోసం గతంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేసిందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. మంగళవారం అచ్చంపేటలోని ఆదర్శనగర్ మాలమహానాడు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళిత, బడుగు బలహీన వర్గాలకు మరింత మేలు జరిగే అవకాశం ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకొచ్చి జాతీయకరణ, పబ్లిక్ రంగ సంస్థల ఏర్పాటు లాంటి చట్టాల ద్వారా దళిత గిరిజన, బలహీన వర్గాల బహుముఖ అభివృద్ధికి పాటుపడిందన్నారు. అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ.. పబ్లిక్ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ.. ప్రైవేటీకరణ చూస్తూ.. దేశ సంపదను వారికి దోచిపెడుతుందన్నారు. బీజేపీని గద్దె దించితేనే దళిత, గిరిజనులు, బలహీన వర్గాలకు రక్షణతో పాటు రిజర్వేషన్ ఉంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు, రమేష్, మన్నె శ్రీధర్‌రావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

పాన్‌గల్: హోటల్‌లోకి ట్రాక్టర్ దూసుకెళ్లిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లరాళ్లపల్లి సమీపంలోని లిటిల్ స్టార్ హైస్కూల్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న హోటల్ ఎదుట ఉన్న బైక్‌ను, సోడ బండిని ట్రాక్టర్ ఢీకొని హోటల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో హోటల్ యజమాని భూషన్న ట్రాక్టర్ కిందపడటంతో కాళ్లకు స్వల్ప గాయమైంది. హోటల్‌లో జనం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన హోటల్ యజమానిని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

8న 'కాళేశ్వరం'పై విచారణ

త్వరలో రాష్ట్రానికి జస్టిస్ చంద్రఘోష్ కమిషన్

- కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణ
- కోల్‌కతాలో జస్టిస్ చంద్రఘోష్‌తో నీటిపారుదల శాఖ కార్యదర్శి భేటీ



సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ ప్రారంభించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ త్వరలో హైదరాబాద్‌కు రానున్నారు. నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేందర్‌రావు, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్ మంగళవారం కోల్‌కతాలో జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో సమావేశమై విచారణ ప్రారంభించే అంశంపై చర్చించారు. బ్యారేజీలపై న్యాయ విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతోపాటు విధివిధానాలను ఆయనకు సమర్పించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని, విచారణ ప్రారంభించడానికి షెడ్యూల్ అందజేయాలని కోరారు. ఈ నెల రెండో వారంలో జస్టిస్ చంద్రఘోష్ హైదరాబాద్‌కు వచ్చి విచారణ ప్రారంభించేందుకు అవకాశముంది.

ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని సీబీఐకి అప్పగించాలని పిటిషన్లు

- నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, ఒక రిట్ పిటిషన్‌ను కలిపి వింటామన్న హైకోర్టు



సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం.. మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లలో వాదనలను సోమవారం(ఈనెల 8న) వింటామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్లలో ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు పిటిషన్ల తరఫు న్యాయవాదులకు చెబుతూ.. విచారణను వాయిదా వేసింది. మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు కారకులెవరో తేల్చేందుకు.. పూర్తి అంశంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది.

'జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలి. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.86 వేల కోట్ల సేకరణ వ్యవహారంపై కూడా సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్‌ఎఫ్‌ఐఓ)తో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలి. మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తేనే కుంగుబాటుకు అసలు కారణాలు బట్టబయలవుతాయి. నవంబర్ 1న నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్ల భద్రతకు వీలుగా చర్యలు చేపట్టేలా నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వాలి' అని కోరుతూ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, కాంగ్రెస్ నేత బక్క జడ్సన్‌తో పాటు మరో ఇద్దరు పిటిషన్లు(4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు, ఒక రిట్ పిటిషన్) దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

ప్రభుత్వ నిర్ణయం తెలుసుకుని చెప్పండి

సీబీఐకి అప్పగించే విషయం, పిటిషనర్ల వాదనపై ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుసుకొని చెప్పాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) ఇమ్రాన్ ఖాన్ ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విజిలెన్స్ విచారణకు ఆదేశించిన విషయాన్ని ఏఏజీ.. ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పార్టీ ఇన్ పర్సన్ (అతనే వాదనలు వినిపిస్తారు)గా కేఏ పాల్ వాదిస్తూ వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. అయితే ప్రభుత్వ వాదన కూడా వినాల్సి ఉన్నందున ఉత్తర్వులు ఇవ్వలేమని ధర్మాసనం పేర్కొంది. తమ వాదనలు వినాలని పాల్, ఇతర పిటిషనర్ల లాయర్లు కోరగా ధర్మాసనం నిరాకరించింది. వ్యాజ్యాలను ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్నామంటూ విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. గతేడాది ఎన్‌డీఎస్‌ఏ అధికారులు ప్రాజెక్టును సందర్శించి మేడిగడ్డ బ్యారేజీ పియర్ కుంగిపోవడానికి కారణాలపై ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ నివేదికను గత నెల విచారణ సందర్భంగా ప్రభుత్వం.. ధర్మాసనం ముందు ఉంచింది.

షీట్ పైల్స్‌కు బదులు సెకెంట్ పైల్స్

- నీటిపారుదల శాఖ సూచనలే కారణం
- నిపుణుల కమిటీకి అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ వెల్లడి
- కటాఫ్, క్రాస్ కటాఫ్ నిర్మాణంలో సైతం ఉల్లంఘనలు

సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ ర్యాఫ్ట్ (పునాదుల) కింద రక్షణగా షీట్ పైల్స్‌ను ఏర్పాటు చేయాలని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) జారీ చేసిన డిజైన్లకు విరుద్ధంగా సెకెంట్ పైల్స్‌ను ఏర్పాటు చేయడానికి ఆ శాఖ జారీ చేసిన సూచనలే కారణమని ..నిర్మాణ సంస్థ 'అఫ్కాన్స్–విజేత–పీఈఎస్ జాయింట్ వెంచర్'తెలిపింది. 2017 ఫిబ్రవరి 4న నీటిపారుదల శాఖ రామగుండం డివిజన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెకెంట్ పైల్స్‌ను వాడాలని లేఖ రాశారని.. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీకి తెలిపింది. కాళేశ్వరం బ్యారేజీల్లోని లోపాలపై అధ్యయనం కోసం ఈ కమిటీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

2019లోనే ప్రమాద ఘంటికలు

సీడీఓ ఇచ్చిన డిజైన్లను ఉల్లంఘించి బ్యారేజీ రెండో బ్లాక్‌కి సంబంధించిన ఎగువ కటాఫ్ వాల్స్‌ను నిర్మించినట్టు నిర్మాణ సంస్థ అంగీకరించింది. అయితే, సంబంధిత ఇంజనీర్ నుంచి ఇందుకు ఆమోదం తీసుకున్నట్టు తెలిపింది. క్రాస్ కటాఫ్ వాల్స్ నిర్మాణంలో సైతం డిజైన్లను ఉల్లంఘించినట్టు తెలిపింది. 2019 వరదల సందర్భంగా బ్యారేజీ పూర్తిగా నిండిఉండగా, గేట్లను తక్కువ ఎత్తులో పైకి ఎత్తి వరదను వదలడంతో దిగువన రక్షణగా ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోయాయని నిర్మాణ సంస్థ తెలిపింది. ఈఎన్‌సీ రామగుండం విజ్ఞప్తితో మళ్లీ వాటిని పునరుద్ధరించినప్పటికీ, ఆ తర్వాతి కాలంలో వచ్చిన వరదల్లో మళ్లీ కొట్టుకుపోయాయని, 2019 వరదల సమయంలోనే బ్యారేజీ ప్రమాద ఘంటికలు మోగించిందంటూ నిపుణుల కమిటీ అడిగిన ఓ ప్రశ్నకు నిర్మాణ సంస్థ బదులిచ్చింది. కాంక్రీట్ దిమ్మెలు కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతంలో లోతైన గుంతలు పడి బ్యారేజీ పునాదుల కింద ఏర్పాటు చేసిన సెకెంట్ పైల్స్‌కి నష్టం కలిగించాయని తమ పరిశీలనలో తేలినట్టు వెల్లడించింది. బ్యారేజీ దిగువన తగిన స్థాయిలో నీటి నిల్వకు ఏర్పాట్లు లేకపోవడంతోనే ఇలా జరిగిందని వివరించింది. బ్యారేజీ దిగువన తగిన స్థాయిల్లో నీళ్ల నిల్వ ఉండేలా ప్రత్యామ్నాయ టెయిల్ పాండ్ వంటి నిర్మాణాన్ని చేపట్టాలని మోడల్ స్టడీస్ నిర్వహించిన నిపుణులు చెప్పినట్లు తెలిపింది.

బ్యారేజీలో నీళ్లు నిల్వ చేయరాదు

బ్యారేజీకి శాశ్వత రక్షణ చర్యలు తీసుకునే వరకు నీటిని నిల్వ చేయరాదని నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. వచ్చే ఏడాది వచ్చే వరదను ఎప్పటికప్పుడు వదిలేయాలని సూచించింది.

ముక్కలు చేసి.. మూసీలో పడేసి!

▶ మొదటి పేజీ తరువాయి

పొందుపరిచారు. మంగళవారం వీరిద్దరిని గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి శనివారం వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ప్రణీత్‌రావు దారికి వచ్చాడంటూ...

ఈ కేసులో తొలి అరెస్టు ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుదే. తొలుత పోలీసు విచారణకు అతడు సహకరించలేదని, అయితే రానురాను సహకరిస్తూ కీలక వివరాలు వెల్లడించారని పోలీసులు కోర్టుకు తెలిపారు. ప్రభాకర్‌రావు రాజీనామా చేసిన రోజే (గత ఏడాది డిసెంబర్ 4న) ఆయన ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న టీఎస్ఎస్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కైతోజు కృష్ణతో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ తాను ఏర్పాటు చేసుకున్న వార్‌రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలు ఆఫ్ చేయించాడు. వార్‌రూమ్‌లోని 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. తనతో వచ్చిన ఎలక్ట్రీషియన్‌తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ముక్కలు చేశాడు. వీటి శకలాలను



వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి నిందితులు తిరుపతన్న, భుజంగరావు

నాగోలు వద్ద మూసీనదిలో పారేశాడు. ఈ విషయాలు వెలుగులోకి రావడంతోనే అప్రమత్తమైన సిట్ అధికారులు మూసీలో సోదాలు చేశారు. వీరికి ధ్వంసమైన హార్డ్‌డిస్క్ కేసులు 5, హార్డ్‌డిస్క్ ముక్కలు తొమ్మిది లభించాయి. వీటితో పాటు తాము మూసీ నుంచే ఆరు మెటల్ హార్డ్‌డిస్క్ ముక్కల్నీ సీజ్ చేశామని కోర్టుకు తెలిపారు.

ఎస్ఐబీ కార్యాలయం నుంచి ఆధారాలు

ప్రణీత్‌రావు వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు మూసీనది నుంచే కాకుండా గ్రీన్‌లాండ్స్‌లోని ఎస్ఐబీ కార్యాలయం, దాని ఆవరణ, పరిసరాల నుంచి కొన్ని ఆధారాలు, భౌతిక సాక్ష్యాలు సేకరించారు. అక్రమ ట్యాపింగ్‌కు వినియోగించిన 12 కంప్యూటర్లు, 7 సీపీయూలు, ల్యాప్‌టాప్, మానిటర్లు, పవర్ కేబుళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఎలక్ట్రీషియన్ గదిలో క్లూస్, ఫోరెన్సిక్ అధికారులతో కలిసి సోదాలు చేసిన సిట్.. హార్డ్‌డిస్క్‌లు కట్ చేస్తున్నప్పుడు కింద పడి, మూలలకు చేరిన వాటి పొడిని సీజ్ చేశారు. ఎస్ఐబీ కార్యాలయ ఆవరణలో పాక్షికంగా కాలిన డాక్యుమెంట్లు, స్పైరల్ బైండింగ్ చేసిన పత్రాలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీకి సంబంధించిన లాగ్‌బుక్ ప్రతులను పోలీసులు సేకరించారు. ఎస్ఐబీ కానిస్టేబుల్ కొత్త నరేష్‌గౌడ్ నుంచి వాంగ్మూలం నమోదు చేశారు.

ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌కు నోటీసులు?



అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ వేణుగోపాల్‌రావుకు సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఎస్‌ఓటీలో పని చేయడానికి తన నమ్మిన బంటుల్ని నియమించుకోవాలని ప్రభాకర్‌రావు భావించి నల్లగొండ నుంచి ప్రణీత్, రాచకొండ నుంచి భుజంగరావు, సైబరాబాద్ నుంచి వేణుగోపాల్‌రావు, హైదరాబాద్ నుంచి తిరుపతన్నలకు అవకాశం ఇచ్చారు. వీరు ఎస్ఐబీతో పాటు మరో మూడు ప్రాంతాల్లో సర్వర్లు ఏర్పాటు చేసి సాంకేతిక నిఘా కొనసాగించారని తెలిసింది. ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించడానికి వేణుగోపాలరావును విచారించాలని సిట్ నిర్ణయించుకుంది. దీంతో బుధవారం బంజారాహిల్స్ ఠాణాలో విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్ట్‌లో వేణుగోపాల్‌రావు పేరును సిట్ అధికారులు పొందుపరిచారు. వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన వేణుగోపాల్ 1989లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. చిగురుమామిడి, కరీంనగర్ రూరల్, జమ్మికుంట ఠాణాల్లో పని చేస్తుండగా అనేక వివాదాలకు కేంద్ర బిందువు అయ్యారు. 2013లో డీఎస్పీ పదోన్నతి పొంది పెద్దపల్లి, సైబరాబాద్ క్రైమ్స్, ఎల్బీనగర్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఎస్ఐబీలో అదనపు ఎస్పీ హోదాలో దాదాపు ఏడేళ్లు పని చేసి పదవీ విరమణ పొందారు. ఆపై ప్రభాకర్‌రావు సహకారంతో ఓఎస్డీగా కొనసాగారు.

అత్తింటి ఆరళ్లకు ముగ్గురు బలి

- ఏడాది బిడ్డను చంపి.. తల్లి ఆత్మహత్య
- కూతురు, మనవడి మృతితో అమ్మమ్మ బలవన్మరణం
- కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో విషాదం



శ్రీజ, రేయాన్ష్ మృతదేహాలు

కరీంనగర్ రూరల్‌: అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులను తట్టుకోలేక ఏడాది బిడ్డకు విష గుళికలు ఇచ్చి చంపిందా తల్లి. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని తట్టుకోలేక మృతురాలి తల్లి సైతం ఆత్మహత్యకు పాల్పడింది. ఒకేరోజు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతితో కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామంలో తీరని విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. బొమ్మకల్ గ్రామ పంచాయతీ విజయ్‌నగర్‌కాలనీలో ఉంటున్న ఉపాధ్యాయ దంపతులు గద్దె వెంకటేశ్వరచారి– జయప్రద(55) తమ చిన్న కూతురు శ్రీజ(25)కు మూడేళ్లక్రితం వరంగల్ జిల్లా మొగ్దుంపూర్‌కు చెందిన నరేశ్‌తో కట్నకానుకలతో వివాహం జరిపించారు. ఏడాదిపాటు సక్రమంగా కాపురం చేసిన నరేశ్... కొడుకు ఆర్యన్(1) పుట్టాక శ్రీజను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. అత్తమామలు సుజాత–కేశవచారి హింసించడంతో శ్రీజ గత నెల 29న బొమ్మకల్‌లోని పుట్టింటికి వచ్చింది. మంగళవారం ఉదయం 6గంటలకు కొడుకు మొదటి బర్త్‌డే గురించి నరేశ్‌కు శ్రీజ ఫోన్ చేయడంతో అత్తమామలు, భర్త కలిసి తీవ్రంగా దూషించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీజ క్రిమిసంహారక మాత్రలను కొడుకు ఆర్యన్‌కు తాగించి ఆ తర్వాత తానూ వేసుకుంది. అపస్మారకస్థితిలో పడి ఉన్న తల్లి, కొడుకులను జయప్రద, వెంకటేశ్వరచారి అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బిడ్డ మృతిచెందగా శ్రీజ చికిత్స పొందుతూ చనిపోయింది. కూతురు, మనవడి మృతిని తట్టుకోలేక జయప్రద ఇంటికివెళ్లి క్రిమిసంహారక మాత్రలు వేసుకుంది. ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

ప్లాట్ల ఆక్రమణకు యత్నం

జడ్చర్ల: పట్టణ శివారులోని ఓ వెంచర్‌లో కొన్నేళ్ల కిందట కొనుగోలుచేసిన ప్లాట్లను కొందరు ఆక్రమించేందుకు యత్నించారు. బాధితుల వివరాల మేరకు.. జడ్చర్ల – మాచారం గ్రామాల శివారులోని డీటీసీ సమీపంలో 25 ఏళ్ల కిందట ఏర్పాటుచేసిన బాలాజీ వెంచర్ డీ బ్లాకులో మంగళవారం కొందరు ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి.. చుట్టూ రాతి కడీలను పాతేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల కొనుగోలుదారులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. తమ ప్లాట్లను ఆక్రమించే వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వెంచర్ వద్దకు పోలీసులు చేరుకోవడంతో రాతికడీలు పాతే కూలీలు అక్కడి నుంచి నిష్క్రమించారు. జడ్చర్లలో భూమాఫియా పెరిగిపోతుందని.. కష్టపడి కొనుగోలుచేసిన ప్లాట్లను ఆక్రమించుకుని, తప్పుడు దస్తావేజులు సృష్టిస్తున్నారని బాధితుడు జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటినుంచి డ్రగ్స్‌పై స్పెషల్ డ్రైవ్

బిజినేపల్లి: డ్రగ్స్‌పై బుధవారం నుంచి సోమవారం వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం తిమ్మాజిపేటలోని మద్యం గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో ఉన్న మద్యం నిల్వలు, రికార్డులు, బ్రేకేజ్ బాటిళ్ల వివరాలను పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో డ్రగ్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు. వారిలో ఎవరైనా పట్టుబడితే కేసులు నమోదు చేసి జరిమానా విధించడంతోపాటు జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గత నెల 29 నుంచి మంగళవారం వరకు సారాపై స్పెషల్ డ్రైవ్ చేశామని, అలాగే ఈ నెల 9 నుంచి 13 వరకు కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి వచ్చే మద్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. కింగ్‌ఫిషర్ లైట్ బీర్, ఓసీ లిక్కర్ నిల్వల కొరత వలన రేషన్ పద్ధతిలో మద్యం దుకాణాలకు పంపిణీ చేస్తామన్నారు. ఆయన వెంట మద్యం డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ అబ్దుల్ వాసే, స్టోర్ ఆఫీసర్లు లచ్చయ్య, శివ, మధు, విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్ఐ బాలీశ్వరి, సిబ్బంది రమేష్ తదితరులున్నారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో క్రమంగా నీటిమట్టం తగ్గుతోంది. మంగళవారం 1,011 అడుగులకు చేరుకుంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని గతంలోనే నిలిపివేశారు. అయితే జలాశయం నుంచి తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.

'బెల్టు' జోరు!

- గ్రామాల్లో గుట్టుగా మద్యం అమ్మకాలు
- నామమాత్రపు దాడులతో సరిపెడుతున్న అధికారులు



మహమ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న వైన్‌షాపు

గండేడ్‌: పల్లెల్లో బెల్టు దందా జోరుగా సాగుతోంది. ఓవైపు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ.. మద్యం విక్రయాలకు అడ్డుకట్ట పడటంలేదు. కిరాణా దుకాణాలు, చిన్నపాటి డబ్బాలను అడ్డాగా ఏర్పాటు చేసుకుని, మూడు ఫుల్ బాటిళ్లు.. ఆరు బీర్లు అన్న చందంగా బెల్టు దందా సాగిస్తున్నారు. కొందరు ఎన్నికల కోడ్ సాకుతో మరింత ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారు. వైన్స్ దుకాణాల్లో ఎంత అడిగితే అంత మద్యం బెల్టుషాపుల వారికి విక్రయిస్తున్నారు. దీంతో పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. ఉమ్మడి గండేడ్ మండలంలో 49 గ్రామపంచాయతీలు ఉండగా.. బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయి. వీటికి గండేడ్, మహమ్మదాబాద్, నంచర్ల గ్రామాల్లోని వైన్ షాపుల నుంచి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు.

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన..

ప్రతి గ్రామంలో 10కి తక్కువ కాకుండా బెల్టుషాపులు ఉన్నాయి. ఎన్నికల వేళ బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు సాగిస్తూ.. యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. వైన్ షాపుల నుంచి ప్రధాన రహదారుల మీదుగా మద్యాన్ని తరలిస్తే, పోలీసులు పట్టుకుంటారని.. దొడ్డిదారిన తమ గమ్యస్థానాలకు తరలిస్తున్నారు. అక్కడక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినా, మద్యం తరలింపునకు అడ్డుకట్ట పడటంలేదు. ఇటీవల కొంరెడ్డిపల్లి, మంగంపేట, వెన్నాచేడ్ తదితర గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వాహకులపై పోలీసు కేసులు నమోదైనప్పటికీ.. మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

గుట్టుగా అమ్మకాలు..

ఉమ్మడి మండలంలోని మహమ్మదాబాద్, మొకర్లాబాద్, చిన్నవార్వాల్, జూలపల్లి, జిన్నారం, సల్కర్‌పేట, పగిడ్యాల్, మంగంపేట, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో మద్యం విక్రయాలు గుట్టుగా సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే.. స్థానిక పోలీసులు పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి, బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో బెల్టుషాపుల నిర్వాహకులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దొంగచాటున విక్రయించే మద్యానికి ఇష్టారీతిగా ధరలు నిర్ణయిస్తున్నారు. ఒక్కో క్వార్టర్‌ను రూ.20 నుంచి రూ.50 వరకు ఎక్కువగా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లో బెల్టుషాపుల్లో గాని దొంగచాటుగా గాని మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా వైన్ షాపుల్లో తప్ప ఎక్కడ కూడా మద్యం అమ్మరాదు. తనిఖీల్లో ఎక్కడైనా మద్యం పట్టుబడితే, కేసులు నమోదు చేస్తాం. వైన్ షాపుల నుంచి అధిక మోతాదులో మద్యం అమ్మినా వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

– బాలకృష్ణ, ఎక్సైజ్ సీఐ, కోస్గి

పరిమితికి మించి విక్రయాలు..

వైన్ షాపుల నిర్వాహకులు కూడా నిబంధనలను అతిక్రమిస్తున్నారు. పరిమితికి మించి మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఒక్కో వ్యక్తికి 6 ఫుల్ బాటిళ్లు, ఒక కాటన్ బీర్ల వరకు విక్రయించే పరిమితి ఉంది. కానీ వైన్‌షాపుల నిర్వాహకులు ఈ నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులకు ఇబ్బడిముబ్బడిగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఒక్కో వ్యక్తి కాటన్ల కొద్దీ మద్యాన్ని వైన్ షాపుల నుంచి తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో పోలీసులు వైన్‌షాపుల సమీపంలో మాటు వేసి, ఎక్కువగా మద్యం తీసుకెళ్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. కాగా, నిబంధనలు అతిక్రమించి, అధికంగా మద్యం అమ్ముతున్న వైన్‌షాపులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సిర్సనగండ్ల బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ: ఉమ్మడి జిల్లాలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పాలక మండలి, రెవెన్యూ, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ, ఫైర్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని ఈ నెల 16 నుంచి 23 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని శాంతిగూడెంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రామయ్యకు అమరచింత పట్టువస్త్రాలు



అయోధ్య రామాలయ ట్రస్ట్ చైర్మన్‌కు పట్టువస్త్రాలు అందజేస్తున్న అమరచింత పద్మశాలీలు

అమరచింత: అయోధ్య రామయ్య కోసం అమరచింత నుంచి తీసుకెళ్లిన పట్టువస్త్రాలను మంగళవారం తీర్థక్షేత్ర ట్రస్ట్ చంపత్‌రాయ్‌కు అందించామని చేనేత కార్మికుడు సాక రమేష్ తెలియజేశారు. పక్షం రోజులుగా అయోధ్య రామయ్య కోసం అమరచింత పద్మశాలి కులస్తులు పట్టు వస్త్రాలను భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. వీటిని అయోధ్యకు తీసుకెళ్లి శ్రీరాముడితో పాటు ఆంజనేయస్వామి, గరుడ వాహనం కోసం తయారు చేసిన పట్టు వస్త్రాలను ట్రస్ట్ చైర్మన్‌కు అప్పగించారు. పట్టణానికి చెందిన సాక రమేష్, అయోధ్య రామాలయం ప్రతిష్ఠ రోజు అమరచింత నుంచి బైక్‌పై అయోధ్యకు వెళ్లిన సందర్భంలో, పట్టు వస్త్రాలను తయారు చేసుకుని మరోమారు ఇక్కడికి తీసుకొచ్చి స్వామివారికి అలంకరిస్తామని మొక్కుకున్నట్లు తెలియజేశారు. ఇందులో భాగంగానే తయారు చేసిన పట్టు వస్త్రాలను రెండు రోజుల కిందట పట్టణంలోని ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయోధ్యకు పట్టువస్త్రాలను తీసుకెళ్లారు.

వైద్య వృత్తిలో రాణించాలి

- కలెక్టర్ జి.రవినాయక్
- 2018–24 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రవినాయక్

పాలమూరు: ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులు రాబోయే రోజుల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని.. వృత్తిలో నిబద్ధత ఉంటే తప్పక గుర్తింపు వస్తుందని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. పాలమూరు మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన (సమావర్తన–24) స్నాతకోత్సవానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై 2018–24 ఎంబీబీఎస్ పూర్తిచేసిన మెడికో విద్యార్థులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించి, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.రమేష్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జీవన్, నారాయణపేట మెడికల్ కళాశాల ఇన్‌చార్జి డైరెక్టర్ డా.రాంకిషన్, డా.సునందిని, డా. నవకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం అత్తారింటి ఇంటి ముందు శవం

- రెండు రోజుల క్రితం వదిలివెళ్లిన బంధువులు
- సమాచారం తెలియడంతో శవాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించిన పోలీసులు



రంగమ్మ (ఫైల్)

మద్దూరు: ఆస్తి కోసం అత్తగారి ఇంటి బయట శవాన్ని కుటుంబ సభ్యులు వదిలి వెళ్లిన సంఘటన మండలంలోని నందిపాడ్‌లో చోటుచేసుకుంది. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన నాగంపల్లి మొగులయ్య(60)ను కొన్నేళ్ల క్రితం మొదటి భార్య వదిలిపెట్టడంతో సమీప బంధువైన కోస్గి మండలంలోని మీర్జాపూర్‌కు చెందిన రంగమ్మ(45)ను రెండో వివాహం చేసుకున్నాడు. అయితే మొగులయ్యకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆమె కూడా కొన్నాళ్లు కాపురం చేసి వదిలేసి తల్లిగారి ఊరైన మీర్జాపూర్‌కు వెళ్లిపోయింది. వీరికి ఓ కూతురు కూడా ఉంది. ఈ క్రమంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రంగమ్మ తాండూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. దీంతో మృతదేహాన్ని నేరుగా నందిపాడ్‌లోని మొగులయ్య ఇంటి దగ్గరకు తీసుకొచ్చారు. మొగులయ్య ఇంటికి తాళం వేసి ఉండటంతో సంబంధీకులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో శవాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. రంగమ్మ కూతురు అనాథగా మారిందని, తల్లికి దక్కాల్సిన ఆస్తి ఉండటంతో మృతదేహాన్ని అక్కడ వదిలేసినట్లు చెప్పారు. అయితే మృతదేహం నుంచి దుర్వాసన వెదజల్లడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు శవాన్ని నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.